# అసలు రహస్యం

వెలుగునీడ అనే పార్టీ నుండి ఎం.ఎల్.ఎ. గా ఎన్నికయినవాడు ఏకనాథం. ఒక రోజు తన పార్టీ కార్యకర్తలతో తీవ్రంగా చర్చిస్తున్నాడు. ఇంతలో ఒక వ్యక్తి దర్జాగా డైనింగ్ హాల్లోకి వెళ్ళడం చూశారు అక్కడి కార్యకర్తలు. ఏకనాథం అదంతా మామూలే అన్నట్టుగా తన ప్రసంగం కొనసాగిస్తున్నాడు.

అగ్గిపుల్ల గీచి అంటించినా కాలవేమో అన్నంత మురికిగా వున్నవి అతని బట్టలు. శ్రీలంక మ్యాప్ రూపంలో అక్కడ అక్కడ చిరిగి వున్న అతని నిక్కరు, షర్ట్, ఆ పీచుగడ్డం చూస్తుంటే అతను బికారి అని చెప్పవచ్చు. అతనిని చూచికూడా చూడనట్టు నటిస్తున్న ఏకనాథంగారిని చూచి సంశయంలో పడ్డారు ఆ కార్యకర్తలు. చర్చ అయిపోయిన తరువాత ఎవరిదారిన వారు వెళ్ళిపోయారు.

ప్రతిరోజు ఆ వ్యక్తి ఇలాగే రావడం. డైనింగ్ టేబిల్ మీద దర్జాగా భోజనం చేయడం, ఏకనాథంగారి వద్ద అయిదో, పదో తీసుకెళ్ళడం జరుగుతుంది. తరచూ అక్కడికి వచ్చే కార్యకర్తలకు ఈ రహస్యం ఏమిటో అర్థంకాక జుట్టు పీక్కుంటున్నారు.

ఒక రోజు ప్రతిభారావ్, జగన్మోహనరావు అనే ఇద్దరు కార్యకర్తలు ఏకనాథంగారి ఇంటికి వచ్చారు ఏదో పార్టీ పనిమీద. ఇంటి ముందు ఎం.ఎల్.ఎ.గారి కారు లేకపోవడంతో ఆయన ఇంట్లో లేరని నిశ్చయించుకున్నారు ఆ ఇద్దరూ.

అక్కడే ఒక పూలకుండీ వద్ద నుంచొని ఏకనాథం గారి కోసం ఎదురుచూడసాగారు.

ఇంతలో ఇంట్లో ఏదో అలజడి విని ఇద్దరూ అడుగుముందుకు వేశారు. ప్రతిరోజు వారిని సంశయంలో పెడుతున్న వ్యక్తిని బట్లరు విసురుగా బయటికి లాక్కువస్తూ వుంటే చూశారు. ఆ వ్యక్తి విదిలించుకో బోతున్నాడు. ఈ దృశ్యం చూచి వాళ్ళిద్దరూ విస్తుపోయారు. రోజూ ఏకనాథంగారు గౌరవిస్తున్న ఈ వ్యక్తిని ఆఫ్ట్రాల్ బట్లర్ బయటకు ఈడ్చుకురావడం వాళ్ళకు అర్థం కాలేదు. బట్లర్ నేరుగా ఆ ఇద్దరు కార్యకర్తల వద్దకు వచ్చి "సార్! ఈ వెధవ అమ్మగారు, అయ్యగారు ఇంట్లో లేనిది చూచి వచ్చి భోజనం పెట్టమని బెదిరిస్తున్నాడు, లేకపోతే నా ఉద్యోగం పీకిస్తాడట. మొహం చూడు వెధవ మొహం!" అన్నాడు ఆ వ్యక్తివైపు చూస్తూ.

ప్రతిభారావు అనే కార్యకర్త ఇదే అదను అనుకొని లాగి ఒక లెంపకాయ ఇచ్చాడు. "ఎవరు నువ్వు మా ఎం.ఎల్.ఎ.గారిని బ్లాక్‌మెయిల్ చేస్తున్నావు. పోలీస్ స్టేషన్‌కు నడు" అని దబాయించాడు. అప్పటికే బెదిరిపోయిన ఆ వ్యక్తి ఇలా నిజం చెప్పాడు. "నేను, ఏకనాథం ఒకే హోటల్‌లో పిండి రుబ్బేవాళ్ళం. ఆ విధంగా మేమిద్దరం ప్రాణ స్నేహితులమయ్యాం. ఈ విషయం బయట పొక్కకుండా వుండడానికి, నేను కోరినవి తీరుస్తున్నాడు" అని వాపోయాడు. మారుతీ కారు శబ్దం విని నలుగురూ ప్రక్కకు తప్పుకుని నిశ్శబ్దంగా ...డినారు. పాలిపోయిన ఆ వ్యక్తి ముఖం చూసిన ఏకనాథం బట్లర్ మీద కోప్పడ్డాడు. "వాడు క్రొత్త బట్లరు. వాడికి నీ గురించి తెలియదు. బాధపడకు" అంటూ నచ్చచెప్పాడు.

తమను ఖాతరు చేయకుండా ఆ బికారి వెధవని సాదరంగా లోపలికి తీసుకువెడుతున్న ఎం.ఎల్.ఎ.గారిని చూచి ఏడ్వాలో, నవ్వాలో అర్థంకాని ఆ కార్యకర్తలకు ఒక వైపు నుండి కోపం-మరొక వైపు నుండి నవ్వు ముంచుకు వచ్చాయి.

—నౌషాద్ ఖాన్

కున్నారు. అయిదు నిమిషాలలో వాళ్ళందరు తిరుపతి వెంకన్న మొక్కుబడి తీర్చుకోవడానికి బయల్దేరిన బృందంగా మారిపోయారు! నిజానికి వాళ్ళలో ఎక్కువ మంది భారతీయులు కారు! అయినా భారతీయుల పద్ధతులు, అలవాట్లు, బలహీనతలను పూర్తిగా అవగతం చేసుకున్న ఎ.బి.టి. సభ్యులవడంతోవాళ్ళు ఆ కొద్ది సేపట్లోనే భారతీయ భక్తబృందంగా మారిపోయారు.

శశి నెత్తిపైన అట్టతో కట్టిన జుట్టు విగ్గు ముఖానికి గడ్డాలు మీసాలు తగిలించి అతనికి కాషాయ వస్త్రాలు తొడిగారు మూతి కడ్డంగా ప్లాస్టర్ అంటించారు.

డేవ్ శశితో" ఇదివరలో నీ పేరే మైనా కానీ!ఇక నుండి మాత్రం నీవు "మౌన వ్రతస్వామి" గా మసలుకోవాలి! వాళ్ళంతా నీ శిష్యులు. నీ వే మాత్రం తప్పించుకోవాలని చూచినా నీ శిష్యులునిన్ను చిత్రహింస చేస్తారు! గమ్యం చేరుకొనే వరకూ మేం చెప్పినట్లు ప్రవర్తిస్తే నీకే ఆపదారాదు" అన్నాడు.

అలాగే నన్నట్లు తలూపాడు శశి.

గడ్డాలు మీసాలు తగిలించుకున్న భీంసింగ్ శశి వంక క్రూరంగా చూస్తూ ముందుకు నడిచాడు కుంటుకుంటూ!అతన్ని గనుక వదలితే అప్పటి కప్పుడే శశిని చిత్రహింసల పాలు చేసి వుండేవాడే!

మౌన వ్రతస్వామి భక్త బృందంతో సహా షెల్ వెనుక నున్న లగ్జరీ బస్‌లో ఆసీనులయారు. బస్సు కదలటానికి సిద్ధంగా వుంది! డ్రైవర్ ఇగ్నిషన్ కీ తిప్పబోయే సమయంలో చింటూ పరుగెత్తుకుని బస్సు లోపలకు వచ్చాడు.

మౌనవ్రతస్వామి వద్దకు వెళ్ళి "శశీ! ఎందుకు గడ్డాలు మీసాలు తగిలించుకున్నావు" అని అడిగాడు. శశికి వేసిన మేకప్ చింటూని మోసంచేయలేకపోయింది.

ఉలిక్కి పడ్డాడు శశి!

డేవ్, శిష్య బృందం నివ్వెర పోయారు.

కామఫ్లేజ్ హాల్‌లోని మేకప్ సామాగ్రివుపయోగిస్తే మనిషిని గుర్తుపట్టడం అసాధ్యమని నమ్మే వారప్పటి వరకు. ఒక చిన్నారి బాలుడు ఆపాదమస్తకం మేకప్‌లో వున్న మౌనవ్రతస్వామిని ఎలా గుర్తుపట్టాడో అవగాహన కాలేదు వారికి! కామఫ్లేజ్ హల్‌లో శశికి గడ్డాలు మీసాలు అంటించడం చూచాడు చింటూ!

భీంసింగ్ చప్పున ముందుకు వచ్చి చింటూను ఎత్తిబస్‌లోంచి కిందకు గిరవాటెయ్యబోయాడు.

డేవ్ "భీంసింగ్! ఆగు!అ కుర్రవాడిని ఇక్కడ వదిలేసి వెళితే యీ విషయం నలుగురికీ చెబుతాడు మనవెంటే తీసుకువెళదాం" అన్నాడు.

అందరూ తన వంకే చూడడం, భీంసింగ్ తనను గట్టిగా పట్టుకోవడం చూచిన చింటూ భయపడి "వదులు! నేను కిందకు వెళతా!" అంటూ గింజుకోసాగాడు. భీంసింగ్ ఎడమ చేయి చింటూ నోటి కడ్డంగా వుంచాడు చింటూ అరుపులు ఆగిపోయాయి.

మ రుక్షణమే బస్సు బయల్దేరింది!

వెంకటేశ్వర సుప్రభాతం రికార్డు బస్సు స్టీరియో నుండి పెద్దగా విన వస్తుండగా బస్సుషెల్ ఆవరణ దాటింది. షెల్‌గేట్ దాటుతుండగా భీంసింగ్ నల్లని బాండేజి తెచ్చి శశి కళ్ళకు కట్టాడు!

"ఇక నుండి నువ్వు మౌన అంధస్వామివి!" అన్నాడు డేవ్ శశి నుద్దేశించి. బస్సు స్టీరియో నుండి భక్తి గీతాలు నిర్విరామంగా వస్తుంటే అలా రెండు రెండున్నగంటల పాటు ప్రయాణం చేసాక తారురోడ్డు వదిలి మట్టి రోడ్డుపై ప్రయాణం చేస్తున్న సూచనగా కుదుపులు ఎక్కువయ్యాయని గ్రహించాడు శశి.

"కోట దగ్గర కాటే దూరం లేదు! వెంట యీ పిల్లా డెందుకు? పిల్లిని వెంటబెట్టుకుని వెళ్ళినట్టు? గుడ్లగూబలా గుడ్లు మిటకరించి చూత్తన్నాడు! పీక నొక్కి పొదల్లోకి గిరాటెయ్యనా? భీంసింగ్ అరుపులకు చింటూ "శశీ! శశీ! నాకు భయంగా వుంది" అని ఏడవసాగాడు.

"ఆకార పుష్టి నైవేద్య నష్టి అని నీకు ఆకలి ఎక్కువ ఆలోచన తక్కువ! పొదలో శవం చూస్తే మన ఆచూకీ తేలికగా కనుక్కుంటారు పోలీసులు.

ఆ కుర్రాడిని నీ భయంకరాకారంతో దడిపించక వచ్చి యిలా కూర్చో!" అంటూ భీంసింగ్‌ను కోప్పడ్డాడు డేవ్.

కోపంగా శశి వంక, చింటూ వంక మార్చి మార్చి చూస్తూ వెళ్ళి వెనక సీటులో కూర్చున్నాడు భీంసింగ్.

తన పక్కన వచ్చి కూర్చున్న చింటూ చేతిని తన చేతిలోకి తీసుకుని నెమ్మదిగా "భయంలేదు" అన్నట్టు నిమరసాగాడు శశి.

కంటి చూపు, నోటి మాట లేని శశి తన స్పర్శ మాత్రం చేత చింటూ మనసులోని భయాన్ని కొంత వరకు పోగొట్టి అతన్ని ప్రశాంత పర చగలిగాడు!

మట్టి రోడ్డు కడ్డంగా గొలుసు కట్టి వుంచారు!

రోడ్డు పక్కన ఎర్ర అక్షరాలతో "రోడ్ రిపేరు చేయబడుతున్నది" అన్నబోర్డు వున్నది. రోడ్డు అక్కడక్కడా గుంటలు తవ్వి వున్నది రిపేరు అవసరమైనట్లు. గొలుసు కట్టివున్న చోట గుడిసె లోంచి కాకీ దుస్తులు ధరించిన వ్యక్తులు వెలుపలకు వచ్చి ఎర్ర జెండాలు వూపారు బస్సును ఆపమన్నట్లు.

బస్సును ఆపాడు డ్రైవర్.

"యాడికి పెయానం?" అని అడిగాడు కాకీ దుస్తుల యువకుడు.

"కోటలోపాగా వెయ్యటానికి!" డ్రైవర్ సమాధానం వినగానే సంతృప్తిగా తలూపి రోడ్డు కడ్డంగా వున్న గొలుసు తీసాడు. బస్సు ముందుకు కదిలింది! బయటకు తీసిన స్టెన్‌గన్ లోపల గడ్డిలో దాచారా యువకులు?

(సశేషం)